ఆంధ్రజ్యోతి

09/01/2023

# కష్టపడే యువతకు ఎన్నో అవకాశాలు..

- మెట్రో ఎం.డి. ఎన్‌వీఎస్ రెడ్డి
- ఏ.వీ. కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

కవాడిగూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో కష్ట పడే యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, నిజాయితీగా కష్టపడితే ఏ రంగంలోనైనా రాణిస్తారని హైదరాబాద్ మెట్రోరైల్ ఎం.డి. ఎన్‌వీఎస్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో దోమలగూడ గగన్‌మహల్ ఏ.వీ. కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'నాయకత్వ లక్షణాలు- పోరాట పటిమ' అంశంపై జరిగిన సదస్సులో ఎన్‌వీఎస్ రెడ్డి ప్రసంగించారు. సమస్యలు వచ్చినప్పుడు బెదిరిపోవద్దని, ఎవరు ఎలా ఆక్షేపించినా మొక్కవోని దీక్షతో విజయపథం వైపు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. హైదరాబాద్ మెట్రో నిర్మాణ సమయంలో తాను ఎదుర్కొన్న అనేక సమస్యలు, సవాళ్లను సంక్షిప్తంగా వివరించారు.



గంగిరెద్దు విన్యాసాన్ని తిలకిస్తున్న మెట్రోరైల్ ఎండి ఎన్‌వీఎస్ రెడ్డి

ఇటీవల తాను రాసిన కవితా సంపుటి మేఘపథంలోని కొన్ని కవితలను చదివి వినిపిస్తూ యువతను ఉత్తేజ పరిచారు. తెలుగు పండితులు అద్దంకి శ్రీనివాస్ 'తెలుగు మాటలలో తెలివి మాటలు' అంశంపై చమత్కారంగా మాట్లాడారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, పల్లెపాటలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రంగోళి పోటీలలో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వీ ఎల్ ఇందిరాదత్తు, ఎస్.విజయలక్ష్మితోపాటు యువతీ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.